క్లుప్తంగా

జీపీ కార్మికుల వేతనాల మంజూరుపై హర్షం



ములుగు: పెండింగ్ వేతనాలను మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కకు రుణపడి ఉంటామని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి రఘు అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం సీఎం, మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చుతూ సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సద్దునూరి సుదర్శన్, మాట్ల జయకర్, శ్రీలమంతుల జితేంద్రచారి, ఇంజమూరి రమణ, దొంగరి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

'మా భూమి మాకు కావాలి'

కన్నాయిగూడెం: గత ప్రభుత్వం గ్రామాల్లో నగరాలతో సమానంగా పల్లెల్లో కూడా యువత క్రీడల్లో రాణించాలనే ఉద్దేశ్యంతో ప్రతీ గ్రామానికి ఒక క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించింది. అందులో భాగంగా మండల కేంద్రంలో కూడా 30 గుంటల్లో క్రీడాప్రాంగణం ప్రభుత్వ భూమిలో కొంత భూమిని తీసుకొని చదును చేసి క్రీడా సామగ్రి అమర్చి ఏర్పాటు చేసింది. దానిని రైతులు మా భూమి మాకు కావాలని ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం బోర్డులను గురువారం తొలగించారు. క్రీడా ప్రాంగణం ఉంటే భవిష్యత్ తరాల యువతకు ఎంతగానో ఆటలు ఆడుటకు ఉపయోగపడుతుందని మండల ప్రజలు అనుకుంటున్నారు. మరి అధికారులు రక్షిస్తారో, ఏమి చేస్తారో చూడాలని మండల ప్రజలు చూస్తున్నారు.

కంకర పోసిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి



మంగపేట : మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన కోడం భిక్షపతి రైతుకు చెందిన పంట చేనులోని బోరుబావిలో అదే గ్రామానికి చెందిన శివనాగేశ్వర్‌రావు కంకర పోశాడని అతనిపై చర్యలు తీసుకోవాలని భిక్షపతి స్థానిక విలేకరుల ఎదుట వాపోయాడు. తనకు శివ నాగేశ్వర్‌రావు మధ్య భూమికి సంబంధించిన గొడవల కారణంగా తనకు నష్టం జరుగాలనే దుర్బుద్ధితో చేనులో ఉన్న బోరుబావి పనికి రాకుండా పోవాలని కంకర పోశాడని భిక్షపతి వాపోయాడు. ఈ రోజు తనకు జరిగిన విధంగా మరో రైతుకు నష్టం జరుగకుండా మరొకరు ఇలాంటి సంఘటనలకు పాల్పడకుండా నాగేశ్వర్‌రావుపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరాడు.

నోట్‌బుక్స్ పంపిణీ



ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని ఆశ్రమ బాలికల జూనియర్ కళాశాలలోని విద్యార్థినులకు జీసీడీఓ పెనక సుగుణ నోట్‌బుక్స్ గురువారం పంపిణీ చేశారు. విద్యార్థినుల సమస్యలపై స్పందించిన ఐటీడీఏ పీఓ చిత్రమిశ్రా ఆదేశాల మేరకు అధికారులు కళాశాలలోని 85 మంది విద్యార్థినులకు నోట్‌బుక్స్‌ను అందజేశారు. ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాలను కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుహాసిని, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆటోయూనియన్ మండల కమిటీ ఎన్నిక



ఏటూరునాగారం: రాణిరుద్రమదేవి ఆటో యూనియన్ మండల నూతన కమిటీ ఎన్నిక గురువారం స్థానిక అయ్యప్పస్వామి దేవాలయం ఆవరణలో ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా తాళ్లపల్లి కుమార్, ఉపాధ్యక్షులుగా తిరుపతి, ఎస్కే రఫీ, కోశాధికారిగా తాళ్లపల్లి నరేందర్, కార్యదర్శిగా కూనూరు కృష్ణ, సహాయ కార్యదర్శిగా గడ్డం సతీష్, గౌరవ అధ్యక్షులుగా ఇర్సవడ్ల కిరణ్, గడ్డం మహేష్, గంపల శివకుమార్‌లను ఎన్నుకున్నారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అధ్యక్షుడు కుమార్ అన్నారు. కార్యక్రమంలో 68 మంది ఆటో కార్మికులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైతుల రుణమాఫీపై సంబురాలు

- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకాలు



ములుగు రూరల్ : సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ములుగు రూరల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె జయరామ్‌రెడ్డి, జిల్లా నాయకులు బాదం ప్రవీణ్‌లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు గుండ భిక్షపతి, ఆనందం, మొగిలి, తప్పట్ల మొగిలి, ఎర్రబాటి పాపారావు, భిక్షపతి, తోట రాజేందర్, రఘుపతి తదితరులు ఉన్నారు.

ఎస్ఎస్‌తాడ్వాయి: రైతుల రుణాల మాఫీ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అన్నారు. రైతుల ఖాతాల్లో రుణ మాఫీ డబ్బులు జమచేయడం హార్షనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్ దొర , పీఏసీఎస్ మాజీ చైర్మన్ పాక సాంబయ్య , కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బూషబోయిన రవి కుమార్ , సీతక్క యువసేన జిల్లా అధ్యక్షుడు చర్పా రవీందర్ , సింగిల్ విండో డైరెక్టర్లు గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

వాజేడు : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరావు చిత్ర పటాలకుఎ కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. మండల పరిధిలోని ధర్మవరంలో గురువారం సంబురాలు జరుపుకున్నారు. పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ మాట్లాడుతూ రైతులను రాజును చేయడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తల్లడి ఆదినారాయణ, చెన్నం ఎల్ల య్య, సేవాదళ్ అధ్యక్షుడు రాణిమేకల రాంబాబు, నర్సింహారావు, సర్వేశ్వర రావు, పశువుల లక్ష్మణ్, దనిశెట్టి రాంబాబు, సర్వేశ్వరరావు తదితరులున్నారు.

మంగపేట: మండల కేంద్రంలోని వైఎస్సార్ సెంటర్‌లో రైతు రుణమాఫీ పథకాన్ని ప్రకటించడం పై హర్షం వ్యక్తం చేస్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆపార్టీ మండల, జిల్లా, రైతు విభాగం, యువజన కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు. ఆయా మండల కేంద్రాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొని వీక్షించారు.



ఎస్ఎస్‌తాడ్వాయిలో..



వాజేడులో..



మంగపేటలో..

వరద ముంపు ప్రాంతాలపై దృష్టి పెట్టాలి



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వెంకన్న, నాయకులు

ఏటూరునాగారం: ములుగు జిల్లాలోని వరద ముంపు ప్రాంతాలపై అధికారులు దృష్టి సారించాలని ఏటూరునాగారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో మంత్రి సీతక్క ఆదేశాల మేరకు వెంకన్నతో పాటు పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజుతో కలిసి కలెక్టర్ దివాకర టీఎస్‌కు వినతిపత్రాలను సమర్పించారు. జిల్లాలోని వివిధ మండలాలు, ఏటూరునాగారం మండలం, కొండాయి గ్రామాల్లో వర్షం ముంపు లోతట్టు ప్రాంతాలు అయినందున అధికారులు ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని కోరారు. గోదావరి కరకట్ట, లోతట్టు ప్రాంతాలను పరిశీలించాలని ప్రజలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ అధికారులు నిత్యపర్యవేక్షణ చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి ముమ్మానేని రమేష్, జిల్లా యూత్ ప్రధానకార్యదర్శి ఇస్సార్‌ఖాన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గద్దల నవీన్, టౌన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బండారు లక్కీ తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా అమలు చేయాలి

ములుగురూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన 06 గ్యారంటీలను అమలు చేయాలని ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేయాలని బీజేపీ నాయకుడు గోమాస శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని రాయల్ ప్లాజీ కన్వెన్షన్ హాల్‌లో గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అధ్యక్షతన జరిగింది. సమావేశానికి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగలకు ఎలాంటి జాబ్‌కార్డు లేక, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ కేవలం తమ కుర్చీని కాపాడుకునే ప్రయత్నంలో ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజాపాలనను గాలికి వదిలేసిందన్నారు. బీజేపీని బూత్ స్థాయిలో పటిష్టం చేసేందుకు ప్రతి నాయకుడు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్త సురేందర్, నాయకులు తక్కళ్లపల్లి దేవేందర్‌రావు, కొత్త దశరథం, తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం



గాంధీ విగ్రహానికి పూలమాలవేస్తున్న డీసీసీ అధ్యక్షుడు అశోక్

ములుగు: రైతును రాజు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలో గాంధీ చిత్రపటానికి గురువారం పూలమాల వేసి సంబురాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతు రుణమాఫీపై ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకుందన్నారు. ఈ విషయంపై సవాల్‌కు దిగిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామాకు కట్టుబడి ఉండాలన్నారు. వ్యవసాయానికి పూర్వ వైభవం తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి మాత్రమే దక్కుతుందన్నారు. మొదటి దఫాలో రూ.లక్ష రుణమాఫీ చేయడంతో రైతులు ఆనందంలో ఉన్నారని తెలిపారు. మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్ పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



టేకుమట్ల : మాట్లాడుతున్న ఎస్సై ప్రసాద్

టేకుమట్ల: గంజాయి లాంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్సై గివికారి ప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు గంజాయి, మత్తు పదార్థాల వినియోగంపై కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగం ద్వారా నేడు యువత ప్రమాదంలో ఉందని అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి చెడు మార్గాలకు పోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలను సేవించడం మూలంగా మీరు అనుకున్న లక్ష్యాలను సాధించలేరని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మిన, సేవించిన తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఏఎస్సై అమరేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది రమేశ్, మహేందర్, గంగరాజు, మొగిలి, పాల్గొన్నారు.

భూపాలపల్లి అర్బన్: యువత మత్తు పదార్థాలు వాడితే జీవితం అంధకారమవుతుందని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై సంధ్యారాణి తెలిపారు. సింగరేణి హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలపై అవగహణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై సంధ్యారాణి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాలు గుర్తుపెట్టుకుని క్రమశిక్షణతో చదువుకుంటూ మంచిపేరు తీసుకురావాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల నడవడికను, అలవాట్లను ఎప్పటికప్పు డు గమనిస్తూ ఉండాలని, యువత ఎక్కువగా మత్తుకు బానిస అవుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు.

'డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండాలి'

కాళేశ్వరం: విద్యార్థులు డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై చక్రపాణి అన్నారు. కాళేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు డ్రగ్స్, మత్తుపదార్థాలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో వచ్చే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యల గురించి విద్యార్థులకు వివరించారు. మత్తు భవిష్యత్‌ను నాశనం చేస్తుందన్నారు. విద్యార్థులు మత్తుకు దూరంగా ఉండి మంచిగా చదువుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపద్దన్నారు.

ప్రైవేట్ పాఠశాలల తనిఖీ



మొగుళ్లపల్లి : మండలంలోని పర్లపల్లి, ఇప్పలపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ఆమోదిత ప్రైవేట్ పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి వేల్పుల ప్రభాకర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల అకాడమిక్ నివేదికలను, అడ్మిషన్ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు అన్ని ప్రభుత్వ నిబంధన మేరకు నిర్వహించాలన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం పాఠశాలలు విధిగా నడుచుకోవాలని సూచించారు. విద్యార్థులకు విద్య బోధనతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకొని గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సీసీఓ వేణు ఉన్నారు.

మాకు సౌకర్యాలు కల్పించండి

- సమస్యలు పరిష్కరించాలని జూనియర్ కళాశాల విద్యార్థినుల ధర్నా
- స్పందించిన పీఓ చిత్రామిశ్ర
- సమస్యలు పరిష్కరానికి హామీ



ధర్నా చేస్తున్న కళాశాల విద్యార్థినులు

ఎస్ఎస్‌తాడ్వాయి: తమ కళాశాలలో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ గిరిజన బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు గురువారం ధర్నా నిర్వహించారు. సమస్యల పరిష్కారించాలని ప్లకార్డులు పెట్టుకుని కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. కళాశాలలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు కూడా ఇవ్వలేదని, కాస్మోటిక్, సానిటరీ ప్యాడ్‌లు అందజేయాలని కోరారు. కళాశాల భవనం గదులు వర్షానికి ఉరుస్తున్నాయని, మరుగుదొడ్డు, స్నానాల గదులకు తలుపులు కూడా సరిగాలేవని ఆవేదన వ్యక్తం చేశారు. అదనపు తరగతి గదులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు పేర్కొన్నారు. సౌకర్యాలు కల్పించాలని విద్యార్థినులు అధికారులను కోరారు. గిరిజన సంక్షేమశాఖ అధికారులు హామీ ఇచ్చేంత వరకు క్లాస్‌కు వెళ్లేదిలేదని విద్యార్థినులు కళాశాల ఎదుట బైటాయించి ఆందోళన చేశారు.

స్పందించిన ఐటీడీఏ పీఓ

విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీఓ చిత్రామిశ్ర విద్యార్థినుల వద్దకు వచ్చి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌ను పీఓ ఆదేశించారు. ఈసందర్భంగా పీఓ విలేకర్లతో మాట్లాడారు. కళాశాలలోని సమస్యలను పరిష్కరిస్తామని, త్వరగా మరమ్మతులు చేపట్టాలని ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జగ్గయ్యపేట, తాడ్వాయిలో కళాశాలలను ఏర్పాటు చేశారని కానీ, ప్రోవిజన్ లేదన్నారు. ఏజీసీ కళాశాలలను గురుకులానికి కన్వర్షన్ చేస్తే నిధులు మంజూరువుతాయని తెలిపారు. కన్వర్షన్ కోసం ఇప్పటికే ఫైల్ సిద్ధం చేశామని, త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామని పీఓ వివరించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న పీఓ చిత్రామిశ్ర

ఐటీఐలో దరఖాస్తుకు గడువు పెంపు

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశం కోసం రెండో విడతలో భాగంగా అర్హులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. కోపా, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్స్‌లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 21 వరకు రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూ చించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేప్పుడు పదో తరగతి సర్టిఫికెట్‌లో ఉన్నట్లుగా వివరాలు పొందుపర్చాలని, పాస్‌పోర్టు సైజ్ ఫొటో మాత్రమే అప్ లోడ్ చేయాలని, ఫోన్ నంబర్, మెయిల్ ఐడీ, ఆధార్‌కార్డు నంబర్ పేర్కొవాలని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

పాముకాటుతో మహిళ మృతి



పద్మ (ఫైల్)

కాటారం: పాము కాటుతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని జాదారావుపేటలో గురువారం చోటుచేసుకొంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నీలారపు పద్మ (50) ఇంట్లో నిద్రిస్తుండగా మంగళవారం అకస్మాత్తుగా కట్లపాము ఇంట్లోకి ప్రవేశించి కాటు వేసింది. తల్లి రాజక్క గమనించి స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం భూపాలపల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించగా గురువారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి భర్త శంకర్ పదేళ్ల కిందట మృతి చెందాడు. ముగ్గురు కూతుర్లకు ఉండగా వారికి వివాహం జరిగింది. పద్మ తల్లి రాజక్కతో కలిసి ఉంటుంది.

చిన్నపిల్లల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



ఏటూరునాగారం: చిన్న పిల్లలకు మందులు అందజేస్తున్న వలియాబీ, నాయకులు



వెంకటాపురం(ఎం) : విద్యార్థుల వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యుడు శ్రీకాంత్

ఏటూరునాగారం: చిన్నపిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఖలీల్ మెడికల్ స్టోర్ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచిత వైద్య శిబిరంలో పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన వలియాబీ మాట్లాడుతూ చిన్న పిల్లలకు వైద్యం అందించడానికి మంగళవారం, గురువారం, శనివారం పిల్లల డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ వరప్రసాద్, సీపీఎం నాయకులు సూడి కృష్ణారెడ్డి, దావూద్, ఖలీల్, సలీం, అజ్మత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(ఎం): ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని బుర్గుపేట గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పార్వతి, సీహెచ్ఓ సదానందం, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఆహారంపై జాగ్రత్తలు తీసుకోవాలి



హాస్టల్ వంటగదిలో వంట పాత్రలను పరిశీలిస్తున్న వైద్యాధికారి వైశాలి

మంగపేట: విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వారికి అందించే ఆహారంపై జాగ్రత్తలు తీసుకోవాలని మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి వైశాలి సూచించారు. స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య ఆదేశాల మేరకు ఆమె గురువారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్, వంటగది, తాగునీటి సరఫరా తదితర వసతులను ఆమె పరిశీలించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వంట పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వైద్యశిబిరం నిర్వహించి విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ ఖాదర్, అబ్బాస్, ఆశ వర్కర్ సుజాత, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు ప్రారంభం



సభ్యత్వాన్ని స్వీకరిస్తున్న సుజాత

ఏటూరునాగారం : స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా, రాష్ట్ర శాఖలు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషికి ఆకర్షితులై ఉపాధ్యాయులు పెద్దఎత్తున ఎస్టీయూ సభ్యత్వం స్వీకరిస్తున్నారని ఎస్టీయూ మండల అధ్యక్షుడు టీవీ వీరభద్రం అన్నారు. గురువారం మండల కేంద్రంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఇటీవల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన బోడ సుజాత సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా, రాష్ట్ర శాఖలు నిరంతరం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పోరాడుతూ, ఉపాధ్యాయుల సర్వీస్ సమస్యల పరిష్కారంలో నిరంతరం ఉపాధ్యాయులకు అండగా ఉంటూ ధైర్యంగా నిలుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ రాంబాబు, అసోసియేట్ అధ్యక్షుడు అడప రాజేందర్, ఉట్నూర్ రాంబాబు, పోతు రాకేష్ పాల్గొన్నారు.

అటవీ పట్టాలకు రుణాలు ఇవ్వాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శంకర్, తదితరులు

కాటారం: అటవీ హక్కుల పట్టాలకు పంట రుణాలు ఇవ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరి జన సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు సూదుల శంకర్ డిమాండ్ చేశారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి సంబంధించిన కరపత్రాలను మండల కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న అటవీ హక్కుల పత్రాలకు బ్యాంకర్లు పంట రుణాలు ఇవ్వడం లేదన్నారు. గిరిజన రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయిస్తూ పెట్టుబడి లేక భూములను తాకట్టు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. పోడు రైతులపై ప్రభుత్వం వివక్ష వీడాలని, రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఆగస్టు 9న మండల కేంద్రంలో నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్, సభ్యులు మేకల రాజు, శ్రీను, మద్దుకూరి శ్రీను, శరత్, విజయ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.